APTEL/2009/29308

స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

17-02-2026
మంగళవారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 117
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



నటి త్రిషకు నైనార్ నాగేంద్రన్ క్షమాపణ 2





# రైతులకు సర్కార్ బోనస్ ధమాకా

## 2.17 లక్షల మంది ఖాతాల్లోకి రూ.514 కోట్లు

- అన్నదాతలకు క్వింటాల్‌కు రూ.500 అదనపు ప్రోత్సాహకం
- కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వ బోనస్
- నిర్దేశించిన 33 రకాల సన్నబియ్యం పండించిన వారికే లబ్ధి

రాష్ట్రంలోని అన్నదాతలకు రేవంత్ సర్కార్ తీపి కబురు అందించింది. ఎన్నికల హామీలో భాగంగా ప్రకటించిన సన్నవడ్ల బోనస్ నిధులను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. వానాకాలం సీజన్‌లో సన్న రకం ధాన్యం పండించి, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున అదనపు ప్రోత్సాహకాన్ని అందిస్తోంది.

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:**

రాష్ట్రంలోని అన్నదాతలకు రేవంత్ సర్కార్ తీపి కబురు అందించింది. ఎన్నికల హామీలో భాగంగా ప్రకటించిన సన్నవడ్ల బోనస్ నిధులను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. వానాకాలం సీజన్‌లో సన్న రకం ధాన్యం పండించి, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున అదనపు ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా రూ.514.36 కోట్లను విడుదల చేస్తూ పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.17 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ కానుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు (MSP) ఇది అదనం. దీనివల్ల రైతులకు క్వింటాల్‌పై లభించే మొత్తం ఆదాయం గణనీయంగా పెరగనుంది.

**అర్హత ప్రమాణాలు, రకాలు**

ప్రభుత్వం కేవలం సన్న రకాలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. దీనికి సంబంధించి ప్రభుత్వం మిగతా 2లో...

# 11 చోట్ల ఛైర్‌పర్సన్ల ఎన్నిక వాయిదా

## హోరాహోరీగా మున్సిపల్ పోరు

- మేయర్, ఛైర్మన్ పీఠాల కోసం ముదిరిన రాజకీయ సెగ
- క్యాంపుల నుంచి కౌన్సిల్ హాల్‌కు చేరిన వ్యూహప్రతివ్యూహాలు
- కోరం లేక, గందరగోళం నడుమ రేపటికి వాయిదా వేసిన అధికారులు





**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:**

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఛైర్మన్, మేయర్ ఎన్నికల పర్వం అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సాగింది. సోమవారం ఉదయం నుంచే రాజకీయ సెగలు పుట్టించిన ఈ ఎన్నికలు, పలు చోట్ల ప్రశాంతంగా ముగియగా, మరికొన్ని చోట్ల మాత్రం యుద్ధ వాతావరణాన్ని తలపించాయి. ప్రధానంగా 11 మున్సిపాలిటీల్లో నెలకొన్న అనిశ్చితి వల్ల ఎన్నికల ప్రక్రియ అర్ధాంతరంగా వాయిదా పడటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

**క్యాంపుల నుంచి కౌన్సిల్ హాల్ దాకా..**

గత కొద్ది రోజులుగా రిసార్టులు, రహస్య ప్రాంతాల్లో గడిపిన నూతన కౌన్సిలర్లు, కార్పొరేటర్లు సోమవారం ఉదయమే భారీ పోలీసు బందోబస్తు మధ్య కౌన్సిల్ హాల్‌స్‌కు చేరుకున్నారు. తొలుత సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం పూర్తయిన వెంటనే అసలు సిసలైన రాజకీయ చదరంగం మొదలైంది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ఎన్నికలు జరగాల్సి ఉండగా.. ఎక్స్‌అఫీషియో ఓట్ల వినియోగం, సభ్యుల బలాబలాల విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి.

**గందరగోళం.. వాయిదాల పర్వం**

ఎన్నికల సంఘం అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ, 11 మున్సిపాలిటీల్లో మాత్రం సీన్ రివర్స్ మిగతా 2లో...

# ఉమ్మడి నల్గొండలో హస్తం ప్రభంజనం

## 17 పురపీఠాలు కాంగ్రెస్ కైవసం!

- ఒక్క కార్పొరేషన్, 16 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ గెలుపు
- తిరుమలగిరిలో పట్టు నిలుపుకున్న బీఆర్ఎస్
- ముగిసిన ఛైర్‌పర్సన్‌లు, వైస్ ఛైర్మన్‌ల ఎన్నికల పర్వం



2



# హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ గురి

## ఎనిమిది పట్టణాలకు ఇన్‌చార్జుల నియామకం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు
- కాంగ్రెస్ 'గుండాగిరి' చేస్తోంది
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు
- కిడ్నాప్‌లు, అక్రమ ఓట్లతో పదవుల కైవసం
- డీజీపీ, ఈసీకి ఫిర్యాదు చేస్తామని వెల్లడి
- వాయిదా పడిన చోట గెలుపే లక్ష్యం
- రంగంలోకి దిగిన పార్టీ సీనియర్ నేతలు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో, హంగ్ ఏర్పడిన పురపాలక సంఘాలపై బీఆర్ఎస్ తన దృష్టిని కేంద్రీకరించింది. ఫలితాల్లో స్పష్టమైన మెజారిటీ రాని ఎనిమిది మున్సిపాలిటీల్లో పార్టీని విజయతీరాలకు చేర్చే బాధ్యతను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సీనియర్ నేతలకు అప్పగించారు. సోమవారం ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, ఎన్నికల సరళిని సమీక్షించి దిశానిర్దేశం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ తీవ్ర మిగతా 2లో...





# లాయర్ స్వప్న హత్య కేసులో HRC సీరియస్

- పోలీసుల నిర్లక్ష్యంపై మానవ హక్కుల కమిషన్ సీరియస్
- పూర్తి స్థాయి విచారణకు ఆదేశించిన TGHRC ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్
- ప్రాణహాని ఉందని మొరపెట్టుకున్నా పట్టించుకోని మొయినాబాద్ పోలీసులు?
- సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర డీజీపీకి ఆదేశాలు
- న్యాయవాది హత్యను నివారించడంలో వైఫల్యంపై 163 మంది న్యాయవాదుల ఫిర్యాదు
- మార్చి 6న తదుపరి విచారణ

2

# కొత్తగూడెం మేయర్‌గా 'ఎర్ర జెండా'

- సీపీఐ, కాంగ్రెస్ మధ్య కుదిరిన 'రెండున్నరేళ్ల' ఒప్పందం
- మేయర్‌గా గణేశ్, డిప్యూటీ మేయర్‌గా లలిత కుమారి ప్రమాణం
- ఉత్కంఠకు తెరదించిన పంచుకోలు ఫార్ములా
- రామగుండం కార్పొరేషన్‌పై ఎగిరిన 'హస్తం' జెండా..



2

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి యూ-టర్న్



2

- మంత్రి పదవి ముఖ్యం కాదు.. మునుగోడు అభివృద్ధే ముఖ్యం
- పదవులు శాశ్వతం కాదన్న మునుగోడు ఎమ్మెల్యే
- అధిష్టానం హెచ్చరికలా? వ్యూహాత్మక వెనకడుగా?

# ఏపీలో కలిసిన 5 గ్రామాలు తిరిగి ఇవ్వండి

- భద్రాచలం భూములను అప్పగించండి
- పెద్దవాగుప్రాజెక్ట్ శాశ్వత మరమ్మతులకు నిధులు
- టీటీడీ ఆలయ నిర్మాణానికి అనుమతి
- తిరుమల కొండపై తెలంగాణకు ఐదెకరాల స్థలం
- సత్తుపల్లి-కొవ్వూరు, పెనుబల్లి-అమరావతి రైల్వే లైన్ల నిర్మాణానికి సహకారం
- ఏపీ సీఎం చంద్రబాబుకు ప్రతిపాదించిన మంత్రి తుమ్మల
- ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న చిక్కుముడి అంశాలపై సుదీర్ఘ చర్చ

2

# రైతులకు సర్కార్ 'బోనస్' ధమాకా

(మొదటి పేజీ తరువాయి)
కొన్ని కీలక మార్గదర్శకాలను పాటించింది. ప్రభుత్వం నోటిఫై చేసిన 33 రకాల సన్నవడ్లు (ఉదా: తెలంగాణ సోనా RNR 15048, BPT 5204 వంటివి) పండించిన వారికే ఈ బోనస్ వర్తిస్తుంది. ధాన్యంలో తేమ శాతం (17% లోపు), గింజ నాణ్యతను బట్టి బోనస్ మొత్తాన్ని ఖరారు చేస్తారు. మధ్య వర్తుల ప్రమేయం లేకుండా 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్' పద్ధతిలో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు చేరుతాయి.

**సాగుపై పెరిగిన ఆసక్తి**

గత కొంతకాలంగా బోనస్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఆందోళనలో ఉన్న రైతులకు ఈ నిధుల విడుదల ఊరటనిచ్చింది. పంట పెట్టుబడి ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్న వేళ, ఈ అదనపు రూ.500 తోడుగా నిలవనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో సన్న రకం వరి సాగు చేసే రైతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు భావిస్తున్నారు.

# కొత్తగూడెం మేయర్‌గా 'ఎర్ర జెండా'

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల వేడి కొనసాగుతున్న వేళ, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ ఎన్నికలో నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఎవరూ ఊహించని విధంగా సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మధ్య కుదిరిన 'పదవుల పంపకం' ఒప్పందంతో కొత్తగూడెం పీఠంపై ఎర్రజెండా రెపరెపలాడింది. సీపీఐకి చెందిన గణేశ్ కార్పొరేషన్ తొలి మేయర్‌గా ఎన్నికయ్యారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను రెండున్నరేళ్ల చొప్పున పంచుకోవాలన్న ఇరు పార్టీల అధిష్టానాల నిర్ణయంతో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా సాగింది.

**ఒప్పందం ప్రకారం తొలి ఛాన్స్ సీపీఐకే!**

కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. కాంగ్రెస్‌కు 22, సీపీఐకి 22 స్థానాలు రాగా, బీఆర్ఎస్ 8 స్థానాలతో నిర్ణయాత్మక శక్తిగా మారింది. ఈ తరుణంలో బీఆర్ఎస్ మద్దతు తీసుకోవాలా? లేక మిత్రపక్షంతో కలవాలా? అన్న సందిగ్ధంలో ఉన్న సీపీఐ.. చివరకు కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. దీని ప్రకారం మొదటి రెండున్నరేళ్లు సీపీఐకి మేయర్ పదవి, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని నిశ్చయించారు. ఈ ఒప్పందంలో భాగంగా సోమవారం జరిగిన ఎన్నికలో సీపీఐకి చెందిన గణేశ్ మేయర్‌గా, కాంగ్రెస్‌కు చెందిన లలిత కుమారి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు.

**రామగుండంలోనూ 'హస్తం' హవా!**

మరోవైపు, పారిశ్రామిక ప్రాంతమైన రామగుండం కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. మేయర్ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి మహంకాళి స్వామి విజయం సాధించి మేయర్ పీఠాన్ని అధిష్టించారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉండటంతో ఎటువంటి ఆటంకాలు లేకుండానే ఎన్నిక ప్రక్రియ ముగిసింది. నగర అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన మేయర్ మహంకాళి స్వామి ఆకాంక్షించారు.

# 11 చోట్ల ఛైర్‌పర్సన్ల ఎన్నిక వాయిదా

(మొదటి పేజీ తరువాయి)
అయింది. ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్ వంటి ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారాయి. కేతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశంలలో సభ్యుల మధ్య తోపులాటలు, నిరసనల నడుమ కోరం లేకపోవడంతో అధికారులు చేసేదేమీ లేక ఎన్నికను వాయిదా వేశారు. అటు డోర్నకల్, జనగామ, తొర్రూరు మున్సిపాలిటీల్లో కూడా ఇదే పరిస్థితి పునరావృతమైంది. ఎన్నికల నిబంధనల ప్రకారం కనీస సభ్యుల హాజరు (కోరం) లేకపోవడం లేదా శాంతిభద్రతల సమస్య తలెత్తడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఈ 11 కేంద్రాల్లో ఎన్నికను ఎప్పుడు నిర్వహించాలనే దానిపై స్పష్టమైన ఆదేశాలు త్వరలోనే విడుదల చేస్తామని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు.

**పోలీసుల పహారా.. నేతల వ్యూహాలు**

ఛైర్మన్ పీఠం దక్కించుకోవడమే లక్ష్యంగా పార్టీల అగ్రనేతలు తెరవెనుక పావులు కదుపుతున్నారు. వాయిదా పడిన చోట్ల అసమ్మతి నేతలను బుజ్జగించే పనిలో ప్రధాన పార్టీలు నిమగ్నమయ్యాయి. ఉద్రిక్తతలు చోటుచేసుకున్న ప్రాంతాల్లో పోలీసులు 144 సెక్షన్ విధించి, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా బలగాలను మోహరించారు. మొత్తానికి, మెజారిటీ చోట్ల గెలుపు జెండా ఎగిరినప్పటికీ, వాయిదా పడిన ఈ 11 మున్సిపాలిటీల ఫలితంపైనే ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.

# హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ గురి



(మొదటి పేజీ తరువాయి)
స్థాయిలో విరుచుకుపడ్డారు. మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ నేతలు 'గుండాగిరి'కి పాల్పడుతున్నారని మండిపడ్డారు. "రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయి. కిడ్నాప్‌లు, దాడులు, అక్రమ ఎక్స్‌అఫీషియో ఓట్లతో అధికార పార్టీ పదవులను దక్కించుకోవాలని చూస్తోంది. ఇవాళ జరిగిన పరిణామాలే ఇందుకు నిదర్శనం" అని కేటీఆర్ ఆరోపించారు. పోలీసు యంత్రాంగం అధికార పార్టీకి తొత్తులుగా మారిందని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై డీజీపీ తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**వాయిదా వెనుక కుట్రలు**

ముఖ్యంగా 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా పడటం వెనుక కాంగ్రెస్ కుట్ర ఉందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్‌కు బలం ఉన్న చోట, కావాలనే ఒత్తిడి తెచ్చి అధికారులతో ఎన్నికను నిలిపివేయించారని ధ్వజమెత్తారు. గెలవలేమన్న భయంతోనే వాయిదా డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సంఘం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, బాధ్యులైన అధికారులను శిక్షించాలని ఆయన కోరారు. హంగ్ మున్సిపాలిటీల్లో స్వతంత్ర అభ్యర్థుల మద్దతు కూడగట్టడంతో పాటు, వాయిదా పడిన 11 స్థానాల్లో పట్టు సాధించేందుకు బీఆర్ఎస్ తన శ్రేణులను సిద్ధం చేస్తోంది. ఇందుకోసం నియమించిన ఎనిమిది మంది ఇన్‌చార్జులు నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించనున్నారు.

# నటి త్రిషకు నైనార్ నాగేంద్రన్ క్షమాపణ

- అనుచిత వ్యాఖ్యలపై త్రిష లీగల్ నోటీసు
- వెనక్కి తగ్గిన తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు
- పొరపాటున దొర్లిన మాటలు.. విచారం వ్యక్తం చేస్తున్నా అంటూ ప్రకటన
- రాజకీయాల్లోకి నా పేరు లాగొద్దని హెచ్చరించిన త్రిష





**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తమిళనాడు రాజకీయాల్లో పెను దుమారం రేపిన 'వ్యక్తిగత విమర్శల' పర్వం ఎట్టకేలకు ఒక కీలక మలుపు తిరిగింది. టీవీకే పార్టీ అధినేత, నటుడు విజయ్‌ను విమర్శించే క్రమంలో నటి త్రిషపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ సోమవారంబహిరంగంగా క్షమాపణలు చెప్పారు. త్రిష తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు పంపిన కొద్ది గంటల్లోనే ఆయన స్పందిస్తూ, తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు.

**అసలు ఏం జరిగింది?**

ఇటీవల ఒక రాజకీయ సభలో విజయ్ రాజకీయ అరంగేట్రంపై మాట్లాడిన నాగేంద్రన్, హద్దులు దాటి వ్యాఖ్యలు చేశారు. "విజయ్ చాలా అమాయకుడు, ఆయనకు రాజకీయ అనుభవం లేదు. ముందు ఆయన తన ఇంటి నుంచి, ముఖ్యంగా త్రిష ఇంటి నుంచి బయటకు వస్తేనే రాష్ట్ర పరిస్థితులు అర్థమవుతాయి" అంటూ ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు విజయ్ అభిమానుల్లోనే కాకుండా, సాధారణ ప్రజల్లోనూ తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ వివాదంపై నటి త్రిష తన న్యాయవాది నిత్యేష్ నటరాజ్ ద్వారా అధికారిక ప్రకటన విడుదల చేశారు. "రాజకీయాల్లో ఉన్నత స్థానంలో ఉన్న ఒక వ్యక్తి నుంచి ఇంతటి దిగజారుడు వ్యాఖ్యలు వస్తాయని ఊహించలేదు. నాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు, తటస్థంగానే ఉండాలనుకుంటున్నాను. అనవసరంగా నా వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాల్లోకి లాగి నా ప్రతిష్టను దెబ్బతీస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటా" అని త్రిష స్పష్టంగా హెచ్చరించారు.

**అధిష్టానం జోక్యం.. నాగేంద్రన్ పశ్చాత్తాపం**

త్రిష హెచ్చరికతో పాటు బీజేపీ జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు వానతి శ్రీనివాసన్, పార్టీ నేత అన్నామలై ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించడంతో నైనార్ నాగేంద్రన్ వెనక్కి తగ్గారు. "ఆ రోజు ఒక నిర్దిష్ట సందర్భంలో పొరపాటున ఆ మాటలు దొర్లాయి. అది నా ఉద్దేశం కాదు" అని ఆయన పేర్కొన్నారు. తన వ్యాఖ్యల వల్ల త్రిషకు లేదా మరెవరికైనా మనస్తాపం కలిగి ఉంటే మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నానని సోమవారం వెల్లడించారు. క్షమాపణలతో ఈ వివాదానికి ప్రస్తుతానికి తెరపడినప్పటికీ, రాజకీయ ప్రయోజనాల కోసం సినీ ప్రముఖుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యం చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఉమ్మడి నల్గొండలో 'హస్తం' ప్రభంజనం




**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ పురపాలక ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని మరోసారి రుజువైంది. జిల్లా వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. ఒక కార్పొరేషన్‌తో పాటు దాదాపు అన్ని మున్సిపాలిటీలను కైవసం చేసుకుని, ప్రత్యర్థులకు కనీస అవకాశం ఇవ్వకుండా క్లీన్ స్వీప్ చేసింది. సోమవారం జరిగిన ఛైర్మన్‌లు, మేయర్ల ఎన్నికల ప్రక్రియతో జిల్లాలోని పురపాలక సంఘాలపై 'హస్తం' జెండా అధికారికంగా రెపరెపలాడింది.

**నల్గొండ కార్పొరేషన్‌లో తిరుగులేని ఆధిక్యం..**

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 48 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ 35 స్థానాలను గెలుచుకుని ఏకపక్ష ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ 10 స్థానాలకే పరిమితం కాగా, బీజేపీ 2 స్థానాలను మాత్రమే దక్కించుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హవా, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యూహాలు ఇక్కడ కాంగ్రెస్‌కు అఖండ విజయాన్ని అందించాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**మున్సిపాలిటీల్లోనూ అదే జోరు..**

కేవలం కార్పొరేషనే కాకుండా, ఉమ్మడి జిల్లాలోని 17 మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్ తన పట్టు నిరూపించుకుంది. మిర్యాలగూడ, కోదాడ, హుజూర్‌నగర్, దేవరకొండ, సూర్యాపేట, భువనగిరి వంటి కీలక పట్టణాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఛైర్మన్ పీఠాలను అధిష్ఠించారు. చిట్యాల మున్సిపాలిటీలో ఒక ట్రాన్స్‌జెండర్ (సుధాకర్) స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది చరిత్ర సృష్టించగా, ఆమె మద్దతు కూడా అధికార పార్టీకే ఉండటం విశేషం. జిల్లా అంతటా కాంగ్రెస్ గాలి వీచినా, తిరుమలగిరి మున్సిపాలిటీలో మాత్రం బీఆర్ఎస్ తన పట్టును నిలుపుకుంది. రఘునందన్ రెడ్డి ఛైర్మన్‌గా ఎన్నికై గులాబీ జెండాను ఎగురవేశారు.

**మంత్రుల ఇలాకాలో తిరుగులేని గెలుపు..**

మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. తమ సొంత నియోజకవర్గాల్లోని పురపాలికలను కైవసం చేసుకోవడం ద్వారా వారు జిల్లాపై తమ పట్టును మరోసారి చాటుకున్నారు. ముఖ్యంగా నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ సాధించిన మెజారిటీ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఛైర్మన్‌ల ఎన్నిక ప్రక్రియ ముగియగానే నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. "ప్రజా పాలనకు దక్కిన గౌరవం ఇది" అని నూతనంగా ఎన్నికైన ఛైర్మన్లు ప్రకటించారు. త్వరలోనే పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని వారు హామీ ఇచ్చారు.

# ఏపీలో కలిసిన 5 గ్రామాలు తిరిగి ఇవ్వండి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న పలు చిక్కుముడి అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు సంబంధించిన భౌగోళిక, పరిపాలనా సమస్యలను మంత్రి వివరించారు. విభజన సమయంలో ఏపీలో కలిసిన ఏటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కోరారు. ఈ ఐదు పంచాయతీలు తెలంగాణ ప్రాంతాల మధ్య ఉండటం వల్ల అక్కడి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే ఎనిమిది గంటల ప్రయాణం చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు.భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయ భూములు కొన్ని ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండటం వల్ల దేవస్థాన పరిపాలనలో అడ్డంకులు ఎదురవుతున్నాయని మంత్రి వివరించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటే ఈ గ్రామాల విలీనం అవసరమని స్పష్టం చేశారు. అలాగే ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు సాగునీటి ప్రాజెక్ట్ శాశ్వత మరమ్మత్తుల అంశాన్ని కూడా ప్రస్తావించారు. ఈ ప్రాజెక్ట్ కింద సాగయ్యే భూమిలో 85 శాతం ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. మిగిలిన 15 శాతం తెలంగాణలో ఉంది. దీని పునరుద్ధరణకు అయ్యే 92.20 కోట్ల రూపాయల వ్యయాన్ని ఇదే నిష్పత్తిలో ఇరు రాష్ట్రాలు భరించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు.భద్రాచలం పట్టణాన్ని వరదల నుంచి రక్షించే కరకట్ట నిర్వహణపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ పరిధిలో ఉన్న కరకట్ట గోడ దెబ్బతిన్నదని దానివల్ల భవిష్యత్తులో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు సమాచారం ఇచ్చినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. తక్షణమే సాంకేతిక పరిశీలన జరిపి శాశ్వత మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. మరోవైపు ఖమ్మం పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం అనుమతి ఇవ్వాలని అభ్యర్థించారు. అక్కడ భూమి గుర్తింపు పూర్తయిందని పనులు త్వరగా మొదలయ్యేలా చూడాలని విన్నవించారు. తిరుమల కొండపై తెలంగాణ భక్తుల వసతి కోసం ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని మంత్రి తుమ్మల ప్రతిపాదించారు. ప్రత్యేక యాత్రికుల భవనం నిర్మిస్తే పండుగల సమయంలో భక్తులకు వసతి కొరత ఉండదని వివరించారు. రవాణా రంగానికి సంబంధించి సత్తుపల్లికొవ్వూరు, పెనుబల్లిఅమరావతి రైల్వే లైన్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఉభయ రాష్ట్రాల్లో వాణిజ్య పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం అవుతుందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల మధ్య సమన్వయం ఉంటేనే వేగవంతమైన పురోగతి సాధ్యమవుతుందని మంత్రి తుమ్మల అభిప్రాయపడ్డారు. ఈ విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



# లాయర్ స్వప్న హత్య కేసులో HRC సీరియస్






**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** హైదరాబాద్ శివార్లలో సంచలనం సృష్టించిన యువ న్యాయవాది జి.స్వప్న కుమారి (34) హత్య కేసులో పోలీసుల తీరుపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తన ప్రాణాలకు ముప్పు ఉందని, రక్షణ కల్పించాలని బాధితురాలు ముందుగానే మొరపెట్టుకున్నప్పటికీ పోలీసులు స్పందించలేదన్న ఆరోపణలను కమిషన్ సీరియస్‌గా పరిగణించింది. ఈ దారుణ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ని కమిషన్ ఆదేశించింది.

**ముందే హెచ్చరించినా మారని తీరు**

ఈ నెల 4వ తేదీన చేవెళ్ల పరిధిలో జరిగిన భూ వివాదంలో స్వప్న కుమారి దారుణంగా హత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే, ఈ హత్య వెనుక పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని తోటి న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. తన సొంత సోదరుడి నుంచే తనకు ప్రాణహాని ఉందని స్వప్న కుమారి మొయినాబాద్ పోలీసులకు ముందే ఫిర్యాదు చేసినా, వారు కనీస నివారణ చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. విధి నిర్వహణలో పోలీసులు ప్రదర్శించిన ఈ అలసత్వమే ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుందని 163 మంది న్యాయవాదులు కమిషన్‌ను ఆశ్రయించారు.

**న్యాయవాదుల పోరాటం.. కమిషన్ స్పందన**

న్యాయవాదులు దాఖలు చేసిన ఫిర్యాదును (ఎస్.ఆర్. నం. 515/2026) స్వీకరించిన TGHRC ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్, ఈ కేసులో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని ప్రాథమికంగా భావించారు. రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉన్న పోలీసులు ఎందుకు వైఫల్యం చెందారో వివరించాలని స్పష్టం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, అసలు ఏం జరిగిందనే అంశంపై నివేదిక కోరారు. ఈ కేసులో పోలీసుల వైఫల్యంపై లోతైన విచారణ అవసరమని భావించిన కమిషన్.. తదుపరి విచారణను మార్చి 6వ తేదీకి వాయిదా వేసింది. అప్పటిలోగా డీజీపీ కార్యాలయం నుంచి నివేదిక అందాల్సి ఉంది. ఒక న్యాయవాదికే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని న్యాయవాద సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ కేసులో కమిషన్ ఇచ్చే ఆదేశాలు పోలీసు వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచుతాయని భావిస్తున్నారు.

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి యూటర్న్

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో గత కొద్ది రోజులుగా సెగలు పుట్టించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి వివాదం అనూహ్య మలుపు తిరిగింది. తనను మంత్రిని చేయకుంటే ఏకంగా ముఖ్యమంత్రి పీఠం వైపు అడుగులేస్తానని, అధికారాన్ని లాక్కుంటానని ఇటీవల ఘాటు వ్యాఖ్యలు చేసిన ఆయన.. సోమవారం తన స్వరాన్ని ఒక్కసారిగా తగ్గించారు. పదవులు శాశ్వతం కాదని, తనకు పదవి రాకపోయినా పర్వాలేదని చెబుతూనే, మునుగోడు నియోజకవర్గ అభివృద్ధే తన ఏకైక లక్ష్యమని వ్యాఖ్యానించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**హస్తం నేతల మధ్య ముదిరిన 'పీఠం' పోరు..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మధ్య కొంతకాలంగా ప్రచ్ఛన్న యుద్ధం సాగుతున్న విషయం తెలిసిందే. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో తనకు చోటు దక్కడం లేదన్న అసహనంతో ఉన్న రాజగోపాల్ రెడ్డి, ఇటీవల సీఎంపై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించారు. "మంత్రి పదవిని నేను మళ్ళీ అడగను.. నాకూ ఒక రోజు వస్తుంది.. ఆ రోజు పదవిని లాక్కుంటాను" అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపాయి. అంతేకాకుండా, తానే పదేళ్లు సీఎంగా ఉంటానన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడుతూ.. అది అధిష్టానాన్ని అవమానించడమేనని ధ్వజమెత్తారు. పార్టీలో అందరి శ్రమ ఉంటేనే అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు.

**హఠాత్తుగా వెనక్కి తగ్గడానికి కారణమేంటి?**

అయితే సోమవారం మీడియాతో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డిలో పూర్తి మార్పు కనిపించింది. "నాకు మంత్రి పదవి ఇవ్వకపోయినా పర్వాలేదు. కానీ ప్రభుత్వం మునుగోడు అభివృద్ధికి మాత్రం పూర్తి సహకారం అందించాలి. నా ప్రజల కోసం నేను పని చేస్తాను, పదవులు ఇవాళ వస్తాయి రేపు పోతాయి," అని ఆయన పేర్కొన్నారు. రాజగోపాల్ రెడ్డి ఇలా వెనక్కి తగ్గడం వెనుక కాంగ్రెస్ అధిష్టానం జోక్యం ఉందా లేక పార్టీలో ఒంటరి కాకుండా ఉండేందుకు ఆయన అనుసరిస్తున్న వ్యూహాత్మక వెనకడుగా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిన్నటి వరకు ముఖ్యమంత్రి పీఠంపై కన్నేసిన రాజగోపాల్ రెడ్డి, ఒక్కరోజులోనే 'తగ్గి' మాట్లాడటం వెనుక బలమైన కారణమే ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# కోహీర్ మున్సిపల్ "పీఠంపై మ్యాథరి అశోక్!

- ఎంఐఎం మద్దతుతో గెలుపు
- కాంగ్రెస్ ఖాతాలోకి మున్సిపాలిటీ
- హైదరాబాద్ డిప్యుటీ మాజీ మేయర్ బాబా ఫసియొద్దీన్ చొరువతో మూడు రంగుల జెండా ఎగరవేత
- గెలుపే లక్ష్యంగా ప్రసాద్ రెడ్డి వ్యూహం




**కోహీర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లాలో నూతనంగా ఏర్పడిన కోహీర్ మున్సిపాలిటీ పీఠాన్ని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 8 వార్డులను గెలుచుకున్నప్పటికీ పూర్తిస్థాయి మెజార్టీ దక్కలేదు.ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా మజ్లిస్ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) పార్టీకి చెందిన 8వ వార్డ్ కౌన్సిలర్ మొహమ్మద్ రఫీ మద్దతు పలకడంతో,కాంగ్రెస్ పార్టీకి చెందిన 4వ వార్డ్ కౌన్సిలర్ మ్యాథరి అశోక్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో నూతనంగా ఏర్పడిన కోహీర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లింది. మున్సిపల్ డిప్యూటీ చైర్మన్ గా అదే పార్టీకి చెందిన అబ్దుల్ హన్నాన్ జావిద్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎంపికైన చైర్మన్, డిప్యూటీ చైర్మన్, కౌన్సిలర్లతో మున్సిపల్ కమిషనర్ భాస్కర్ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అశోక్ మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.కోహీర్ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని, పారిశుద్ధ్యం,తాగునీరు,రహదారులు,మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.

**హైదరాబాద్ డిప్యుటీ మాజీ మేయర్ బాబా ఫసియొద్దీన్ చొరువతో మూడు రంగుల జెండా ఎగరవేత**




కోహిర్ లో గత 10 సంవత్సరాలనుండి కాంగ్రెస్ జెండా ఎగరలేదు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు హైదరాబాద్ డిప్యుటీ మాజీ మేయర్ బాబా ఫసియొద్దీన్,ను కోహిర్ ఎన్నికల ఇంచార్జిగా ప్రకటించారు .ఈ సందర్భంగా బాబా ఫసియొద్దీన్ చొరువతో గత వారం నుండి బిఆర్ఎస్ కు అనుకూలంగా వున్నా కోహిర్ ప్రజలను పూర్తిగా కాంగ్రెస్ వైపు తిప్పడంలో సక్సెస్ అయ్యారు.తన లక్ష్యం కోహిర్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ చైర్మన్ ను కూర్చోబెట్టి మూడు రంగుల జెండా ఎగరావేయడమే లక్ష్యంగా పని పూర్తి చేశారు.ఈ సందర్భంగా కోహిర్ రాజకీయం లో పూర్తిగా మార్పు తెచ్చారు.

**గెలుపే లక్ష్యంగా ప్రసాద్ రెడ్డి వ్యూహం**

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా జహీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ నాయకులు కె.ప్రసాద్ రెడ్డి,తన సొంత డబ్బులు ఖర్చు చేసి కొందరు అభ్యర్థులను గెలుపులో తాను కృషి చేశారు.అదేవిదంగా కొందరు సర్పంచ్, మరియు ఉప సర్పంచ్ లకు కొన్ని వార్డులకు ఇంచార్జి లుగా పెట్టి అభ్యర్థులకు అండగా వుండీ గెలుపే లక్ష్యంగా వ్యూహం రచించారు.

**ప్రమాణ స్వీకారం అనంతరం భారీ ర్యాలీ**

మున్సిపల్ కార్యాలయంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం డీజే,బ్యాండులతో ర్యాలీగా టపాసులు కాల్చి స్వీట్లు పంచుకొన్నారు. బిధర్ బేస్ లో సన్మాన సభ పెట్టారు. అనంతరం ర్యాలీగా కోహిర్ బస్టాండ్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు వచ్చి అంబేద్కర్ విగ్రహంకు పులమాలలు వేసి నివాళులు అర్పించారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న దళితులు**

కోహిర్ నూతనంగా ఏర్పాటు అయినా మున్సిపల్ లో తొలి మున్సిపల్ చైర్మన్ గా ఓ దళిత బిడ్డా అయినా మ్యాథరి అశోక్,అధికారం చేపట్టడం చాల ఆనందంగా ఉందని స్థానిక దళిత సంఘాల నాయకులు అదేవిధంగా లాలాకుంట కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా నూతన చైర్మన్ అశోక్,కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.




# రవీందర్ కాదు రవన్నగా నే నన్ను పిలుస్తారు!

- పుట్టి, పెరిగిన రాయికల్ కి మంచి గుర్తింపు తీసుకొస్తా
- పదవులు శాశ్వతం కాదు చేసిన అభివృద్ధి శాశ్వతం
- అందరి సహకారంతో పట్టణాభివృద్ధి చేస్తా
- మన్సిపల్ చైర్మన్ రవీందర్

**రాయికల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రాయికల్ పురపాలక రెండవ చైర్మన్ గా ఎన్నికైనా కట్కం రవీందర్ మాట్లాడుతూ..రాయికల్ మున్సిపల్ చైర్మన్ కావడం అదృష్టంగా భావిస్తున్న పట్టణంలో అన్ని వసతులు కల్పించి కౌన్సిలర్స్ సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానాని హామీ ఇచ్చారు.పదవులనేటివి శాశ్వతం కాదు అని పదవి కేవలం 5 సంవత్సరాలు మాత్రమేనని ప్రజలు ఇచ్చిన ఈ అవకాశంతోని ప్రజావసరాలు తీర్చి కలకాలం చిరస్థాయిగా వారి గుండెల్లో ఉండే విధంగానే అభివృద్ధి ఉంటుందని అన్నారు. నేను చైర్మన్ గా కాకుండా అందరికి రవన్న గా గుర్తింపు ఉంది.అదే పేరుతో చిన్న,పెద్ద తేడా లేకుండా అందరి తో కలిసి పనిచేసి రాయికల్ ఒక ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దటమే ద్యేయమని తెలిపారు.ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.తురగ సౌజన్య వైస్ చైర్ పర్సన్ మాట్లాడుతూ..నన్ను అధిక మెజార్టీ తో గెలిపించిన నా వార్డు సభ్యులకు,నా వైస్ చైర్మన్ ఎన్నిక కి మద్దతునిచ్చిన అందరికి కృతజ్ఞతలు..రాయికల్ ప్రజలు నాకిచ్చిన అవకాశంతో అభివృద్ధికి కృషి చేస్తానని, మహిళలకు చేయూత అందిస్తానని హామీ ఇచ్చారు.గత 6 సంవత్సరాల కాలంలో నా భర్త శ్రీధర్ రెడ్డి చేసిన అభివృద్ధి వల్లే నన్ను మంచి మెజారిటీతో గెలిపించారాని తెలిపారు. ప్రజా క్షేత్రంలో అభివృద్ధి చేసిన వారికే పదవులు దక్కుతాయని నా గెలుపే ఒక ఉదాహరణని అన్నారు.అందరి సహాయ సహకారలతో చైర్మన్ కి సహకరించి పట్టానాభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఖేడ్ మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా

**చైర్మన్‌గా నాగేష్ శెట్కార్ బాధ్యతల స్వీకారం**



**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్‌గా నాగేష్ శెట్కార్, వైస్ చైర్మన్‌గా దారం శంకర్ సబ్ కలెక్టర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం ఉంచి ఘనమైన మెజారిటీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. నారాయణఖేడ్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ ఛాంబర్‌లో గణపతి పూజ నిర్వహించి నాగేష్ శెట్కార్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.తరువాత మున్సిపల్ పరిధిలో రోడ్ షో నిర్వహించగా, భారీ ర్యాలీతో విజయం సాధించిన అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. గజమాలతో అలంకరించి ఆనందోత్సాహాలతో అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కె.శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ జగజీవన్,మున్సిపల్ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పండితులు ప్రవీణ్ శర్మ ఏం చెప్పారంటే



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మంగళవారం సూర్యగ్రహణంతో ఎలాంటి ప్రభావం ఉందని,గర్భిణులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెంకటేశ్వర స్వామి ఆలయ పండితులు ప్రవీణ్ శర్మ స్పష్టం చేస్తున్నారు.ఈ గ్రహణం ఇండియాలో కనిపించదు, ఇక్కడ ఎలాంటి గ్రహణ నియమాలు పాటించాల్సిన పనిలేదని తెలిపారు. రేపు మధ్యాహ్నం 3:26 నుంచి రాత్రి 7:57 గంటల వరకు గ్రహణ సమయం ఉన్నప్పటికీ మన ప్రాంతంలో ఎలాంటి ప్రభావం ఉండదని తెలిపారు. గర్భిణులు ఎప్పటిలాగే తమ కార్యకలాపాలు ఆహారం తీసుకోవచ్చని ఆయన చెప్పారు.

# వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గడ్డం అనన్య ఏకగ్రీవ ఎన్నిక

**వైస్ చైర్మన్‌గా అర్ధ సుధాకర్ రెడ్డి ఎంపిక**




**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా కేంద్రంలో రాజకీయంగా ప్రాధాన్యత గల పరిణామం చోటుచేసుకుంది. వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 17వ వార్డు కౌన్సిలర్ గడ్డం అనన్య ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా ఎన్నికైన 34 మంది వార్డు కౌన్సిలర్లతో ఇంచార్జి ఎన్నికల అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో 10వ వార్డు కౌన్సిలర్ అర్ధ సుధాకర్ రెడ్డి వైస్ చైర్మన్‌గా ఎన్నుకోబడ్డారు. ఎక్స్ అఫీషియో మెంబర్ హోదాలో సమావేశానికి హాజరైన వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కార్యక్రమాన్ని అభినందించారు.ఈ సందర్భంగా నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, అలాగే అన్ని వార్డు సభ్యులకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారం ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మున్సిపల్ పాలనలో ఈ సమన్వయం, పారదర్శకతతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో నూతన బృందం బాధ్యతలు స్వీకరించింది.

# స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు

**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తోటి స్నేహితుడు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబానికి అండగా నిలిచారు తనతో పదో తరగతి చదివిన స్నేహితులు. తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20062007 బ్యాచ్ కి చెందిన నక్కల మల్లికార్జున్ (సీతారాంపురం) గత సంవత్సరం క్రితం అనారోగ్యంతో మరణించాడు. దీంతో నాటి పదోవ తరగతి కి చెందిన బీరోలు,పోచారం, బంధంపెల్లి, చౌటపల్లి, సీతారాంపురం, ఎలువారిగూడెం గ్రామాల స్నేహితులు అంతా కలిసి జమ చేసిన రూ.50 వేల నగదును మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి అందచేశారు. మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన తోటి స్నేహితుల ఔదార్యాన్ని పలువురు అభినందించారు.



# కన్నుల పండుగగా శివపార్వతుల కల్యాణం




**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతోపాటు తట్టేపల్లి పరివాహక ప్రాంతంలోని శ్రీ అంబురామేశ్వర దేవాలయంతోపాటు పరిధిలోని అడికిచెర్ల, ఇందూరు, ఆత్కూర్, మంబాపూర్,గాజీపూర్,జనగాం, బండమీదిపల్లి, కందనెల్లి గ్రామాలతోపాటు పలు శివాలయాల్లో మహాశివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి.ముఖ్యంగా మండల కేంద్రంలోని శ్రీ శంభులింగేశ్వర దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం నుండే భక్తులు ఉపవాసాలను చేపట్టి అనంతరం ఆలయానికి చేరుకొని అభిషేకాలను, రుద్రాభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కులు మొక్కారు.సాయంత్రం శ్రీ శంభులింగేశ్వర ఆలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించిన 1,116 సహస్ర దీపారాధనలో పాల్గొని దీపాలను వెలిగించారు.అదే విధంగా ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలు,ఆలయ ధర్మకర్త సంకేపల్లి నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మణోత్తముల సమక్షంలో ఆదివారం రాత్రి 12:44 నిముషాలకు భక్తులు, గ్రామస్తుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించి పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహాన్ని పొందారు.భక్తులకు, గ్రామస్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ పెద్దలు, ఆలయ ధర్మకర్త నరేష్ రెడ్డి అన్ని రకాల ఏర్పాట్లను చేశారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవంతో శివనామస్మరణతో, ఓం నమ:శివాయ, హర హర మహాదేవ శంభోశంకర నామస్మరణలతో మండల కేంద్రంలోని శ్రీ శంభులింగేశ్వర ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మారుమోగింది.శ్రీ శంభులింగేశ్వర దేవాలయంలో ఆలయ ధర్మకర్త సంకేపల్లి నరేష్‌రెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భక్తుల, గ్రామస్థుల సమక్షంలో బ్రాహ్మణోత్తముల మంత్రోచ్చారణల మధ్య శ్రీ పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది.మహా శివరాత్రి ఉత్సవాలతో పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులతో, గ్రామస్తులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకొన్నాయి. మహాశివరాత్రి ఉత్సవాల్లో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేటి నుంచి నూతన ఉప సర్పంచ్లకు వార్డ్ మెంబర్లకు శిక్షణ

**ఎంపీడీవో సోమలింగం**



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల కేంద్రంలో డిపిఓ ఆదేశాల మేరకు ఐదు రోజులు పాటు ఉదయం 8 గంటల నుండి సాయంత్రకాలం 5 గంటల వరకు 24 గ్రామపంచాయతీల నూతనంగా ఎన్నికైన వార్డ్ మెంబర్లు ఉప సర్పంచ్లు లకు శిక్షణ తరగతులు ఉంటాయి అన్నారు.చౌడాపూర్ రైతువేదికలో 12 గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లకు ఉప సర్పంచ్లకు అదేవిధంగా మరికల్ రైతు వేదికలో 12 గ్రామ పంచాయతీల వార్డ్ మెంబర్లు ఉపసర్పంచ్ లకు శిక్షణ తరగతులు ఉంటాయని మండల పరిషత్ అధికారి సోమలింగం తెలిపారు.ఈ ట్రైనింగ్ లో నూతనంగా ఎన్నికైన వార్డ్ మెంబర్లు ఉప సర్పంచ్లు తప్పకుండా హాజరు కావాలని ఎంపీడీవో సోమలింగం తెలపడం జరిగింది.

# విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే ఫినిషింగ్ స్కూల్ ఎంప్లాయబిలిటీ శిక్షణ

- ప్రొఫెషనల్ స్కిల్‌స్‌కు మంచి డిమాండ్ ఉందని,విద్యార్థులు సమగ్ర అభివృద్ధి సాధించాలి
- కళాశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య
- విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి,కార్పొరేట్ రంగంలో రాణించేలా దోహదపడుతుంది
- కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.సాయి గీతి
- ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి
- కళాశాల ప్రిన్సిపాల్ డా.జె.లక్ష్మి నారాయణ






**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఖమ్మం రూరల్ స్థానిక పొన్నేకల్ లోని శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్‌లో ఇన్ఫోసిస్ మరియు ఐసిటి అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 15 రోజుల ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయబిలిటీ శిక్షణా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమాన్ని ఐసిటీ అకాడమీ తెలంగాణ హెడ్ బి.గోపాల్ ప్రారంభించారు.ఈ కార్యక్రమం 16022026నుండి 05032026వరకు నిర్వహించబడుతుంది.ఈ సందర్భంగా తెలంగాణ ఐసిటి అకాడమీ స్టేట్ హెడ్ బి.గోపాల్ మాట్లాడుతూ..ఈ శిక్షణా కార్యక్రమం చివరి సంవత్సరం విద్యార్థులకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ప్రత్యేకంగా రూపొందించబడిందని తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్,ఇంటర్వ్యూ టెక్నిక్స్, రెజ్యూమ్ తయారీ అంశాలపై నిపుణులచే సమగ్ర శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.సాయి గీతిక మాట్లాడుతూ, విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి,కార్పొరేట్ రంగంలో రాణించేలా తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ప్రిన్సిపాల్ డా. జె. లక్ష్మి నారాయణ మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య మాట్లాడుతూ..ప్రస్తుత కాలంలో డేటా అనలిటిక్స్,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలలో టెక్నికల్ మరియు ప్రొఫెషనల్ స్కిల్‌స్‌కు మంచి డిమాండ్ ఉందని, విద్యార్థులు సమగ్ర అభివృద్ధి సాధించాలని కోరారు.ఈకార్యక్రమంలో డీన్ డాక్టర్ వి.సుదర్శన్,టిపిఓ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి,డిప్లమా ఇన్చార్జి కృష్ణ ప్రసాద్,డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణతి,డాక్టర్ చార్యులు, సురేష్ పాల్గొన్నారు.

# హామీని నిలబెట్టిన నాయకత్వం..ఆడబిడ్డ పెళ్లికి అండగా నిలిచిన కేసారం సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య

- ఆర్థిక సహాయంగా 25 వేల చెక్కు అందజేత
- ఎన్నికల హామీ అమలు గ్రామ ప్రజల ప్రశంసలు



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లాలోని కేసారం గ్రామంలో ప్రజా ప్రతినిధి అంటే మాట నిలబెట్టే నాయకుడనే నమ్మకాన్ని మరొక్కసారి సాక్షాత్కరించారు గ్రామ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా గ్రామానికి చెందిన ఓ ఆడబిడ్డ పెళ్లికి రూ.25,000 ఆర్థిక సహాయం అందించి ప్రజల మనసులు గెలుచుకున్నారు.గ్రామీణ కుటుంబాల్లో ఆడపిల్ల పెళ్లి ఒక పెద్ద బాధ్యతగా భావిస్తారు. అలాంటి సమయంలో సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య ముందుకు వచ్చి ఆర్థికంగా చేయూతనందించడం అభినందనీయం. ఎన్నికల హామీ కేవలం మాటల్లో కాకుండా చేతల్లోనూ ఉండాలనే తన నిబద్ధతను ఆయన ఈ చర్య ద్వారా స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..“ప్రజలు నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం నా తొలి బాధ్యత. గ్రామంలోని ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలి. ముఖ్యంగా ఆడబిడ్డల భవిష్యత్తు భద్రంగా ఉండేలా చేయడం మనందరి కర్తవ్యం” అని తెలిపారు.ఈ కార్యక్రమానికి హాజరై సర్పంచ్‌ను అభినందించిన మాజి ఎంపీపీ బీఆర్ఎస్ మోమిన్‌పేట్ మండల అధ్యక్షులు దబ్బాని వెంకట్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి మరియు సంక్షేమం కోసం సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య చేస్తున్న కృషి ప్రశంసనీయం. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం నిజమైన ప్రజా నాయకత్వానికి నిదర్శనం” అని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, మహిళలు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సర్పంచ్‌ను అభినందించారు. “మాట ఇచ్చి నిలబెట్టుకునే నాయకుడు మా గ్రామానికి దక్కడం మా అదృష్టం” అని గ్రామస్తులు పేర్కొన్నారు. కేసారం గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ సమాంతరంగా సాగుతున్నాయని గ్రామ ప్రజలు అభిప్రాయపడ్డారు. ఈ సేవా కార్యక్రమం ఇతర ప్రజా ప్రతినిధులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ, నాయకత్వానికి కొత్త అర్థాన్ని అందించింది. గ్రామ సంక్షేమానికి అంకితభావంతో ముందుకు సాగుతున్న సర్పంచ్ గుజ్జరి కిష్టయ్యకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకై మంత్రిని కలిసిన తండా వాసులు

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ ను గ్రామస్థులు కోరారు.అల్లాదుర్గం మండలంలోని నడిమి తండా,గొల్లకుంటా తండా,గ్రామస్థులు,సర్పంచ్ లు సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ను కలిసి సమస్యలను విన్నవించారు. సంగారెడ్డి జిల్లా వట్ పల్లిలో కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలలో పాల్గొనేందుకు వెళ్తుండగా మండల పరిధిలోని ఐబీ చౌరస్తా వద్ద ఆగి వారితో ముచ్చటించారు.తండాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని గ్రామస్థులు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో నడిమితండా మాజీ సర్పంచ్ రంజిత్,గొల్ల కుంట తండా సర్పంచ్ మాన్య నాయక్,తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.



## నారాయణఖేడ్ చైర్మన్ గా నగేష్ కుమార్ శెట్కర్

**వైస్ చైర్మన్ గా దారం శంకర్ సెట్**





**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నారాయణఖేడ్ మున్సిపల్ నూతన చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీకి చెందిన సురేష్ కుమార్ శెట్కర్ , వైస్ చైర్మన్ గా దారం శంకర్ సెట్ ఎన్నికయ్యారు. సోమవారం నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయించారు.ఈనెల 11న జరిగిన మునిసిపల్ ఎన్నికలు జరగక 13 న ఓట్ల లెక్కింపులో విజయం సాధించి అభ్యర్థులను సోమవారం నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఉమ హారతి అధ్యక్షతన 15 మంది కౌన్సిలర్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ , వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. చైర్మన్ గా నగేష్ కుమార్ శెట్కర్, వైస్ చైర్మన్ గా దారం శంకర్ సేటును ప్రతిపాదించారు.నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమారతి,మున్సిపల్ కమిషనర్ ఏడిఈఏ జగ్జీవన్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించడం జరిగింది. 15 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రత్యేక సమావేశం అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నగేష్ కుమార్ శెట్కర్ కు 11 మంది మద్దతు పలికారు. మంగళవారం నారాయణఖేడ్ మున్సిపల్ చైర్ పర్సన్ గా నగేష్ కుమార్ శెట్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్మన్ గా దారం శంకర్ సేటు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులు ఉండగా కాంగ్రెస్ 11, కైవాసం చేసుకున్నారు. బీఆర్ఎస్ 3, భాజపా 1 గెలుచుకున్న విషయం తెలిసిందే.ఈ క్రమంలో చైర్మన్,వైస్ చైర్మన్ ఎంపిక ప్రక్రియ సజావుగా ముగిసింది.

## చైర్మన్ నగేష్ కుమార్ షట్కార్ కు ఘన సన్మాన

**నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ రహీం**



**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీ సురేష్ కుమార్ షట్కార్ సోదరులైన నగేష్ కుమార్ షట్కార్ ఎనిమిదో వార్డ్ నుండి కౌన్సిలర్గా భారీ మెజార్టీతో గెలుపొందగా మున్సిపల్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి చేతుల మీదుగా మున్సిపల్ చైర్మన్ గా నగేష్ కుమార్ షట్కార్ ప్రమాణస్వీకారం చేశారు.ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ రహీం నారాయణఖేడ్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు గైని కలిసి మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షట్కార్ కు పీసీసీ సభ్యులైన కే శ్రీనివాస్ లకు వారి నివాస గృహంలో గజమాలతో శాలువాలతో ఘనంగా సన్మానించి పూల బొకే ఇచ్చి సత్కరించారు.ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు నారాయణఖేడ్ మున్సిపాలిటీలో 11 మంది కౌన్సిలర్గా కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొంది మున్సిపల్ చైర్మన్గా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సన్మానించిన అబ్దుల్ రహీం మరియు గైని సాయిలు,వారి సోదరులు,మిత్రులు పేర్కొన్నారు నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ కావడానికి కృషి చేసిన ఎంపీ సురేష్ కుమార్ కు ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు నారాయణఖేడ్ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించి కృషి చేస్తారని మనస్ఫూర్తిగా నమ్ముతూ ఆశిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికైన అనంతరం ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు అభిమానులకు తోటి సోదరులకు మా సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గౌస్ చిస్తి,జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ మైనోద్దీన్ ఖురేషి,డివిజన్ అధ్యక్షులు నర్సింలు,నాయకులు సమీయొద్దీన్, తయ్యాబ్,కత్తె ఓంకార,ర్యాకల్ విట్టల్ రెడ్డి,ఫైసల్ ఖురేషి,ఇస్మాయిల్,జుకల్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## బోడగమ్మ గ్రామంలోయేసుక్రీస్తు రక్షణ సువార్త మహాసభలు

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం పరిధిలోని బోడగమ్మ (బోరేగావ్) గ్రామంలో ఫిబ్రవరి 18 నుండి 20 వరకు మూడు రోజుల పాటు యేసుక్రీస్తు రక్షణ సువార్త మహాసభలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. బోరేగావ్ క్రైస్తవ సహోదరులు నిర్వహిస్తున్న ఈ 11వ వార్షిక మహాసభల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 40 రోజుల సంపూర్ణ ఉపవాస ప్రార్థనల ముగింపు సందర్భంగా,ఆత్మల రక్షణార్థం ఈ ప్రత్యేక సభలను నిర్వహిస్తున్నారు.ఈ మహాసభలలో ప్రతిరోజూ సాయంత్రం 5:00 గంటల నుండి దైవ సందేశాలు ప్రారంభమవుతాయి. ఏలూరు జిల్లా పెదలంక హోలీ చర్చి దైవజనులు కె.జాన్ మంగాచార్యులు, హైదరాబాద్ రాజా ఫెయిత్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు దైవజనులు రాజా హేబెల్, మరియు హైదరాబాద్ బ్రిమ్ ట్రూ వర్డ్ సెంటర్ దైవజనులు కె.ఆర్.జాన్ ముఖ్య వక్తలుగా విచ్చేసి దేవుని వాక్యాన్ని అందించనున్నారు. బ్రదర్ కె.ప్రశాంత్, సిస్టర్ ఝాన్సీరాణి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సభలకు బోడగమ్మ గ్రామ విశ్వాసులు,పెద్దలు,యువజన సంఘం వారు అందరినీ ప్రేమతో ఆహ్వానిస్తున్నారు.ఈ మూడు రోజుల పాటు సభకు విచ్చేసే భక్తులందరికీ ప్రత్యేకంగా ప్రేమవిందు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.ఈ మహాసభల ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఆశీర్వాదం కలగాలని, ప్రతి ఒక్కరూ ఈ దైవ కార్యంలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. మరిన్ని వివరాల కోసం 9618171506, 9515303863, 9346362942 నంబర్లను సంప్రదించవచ్చు.






# యాడీబాపుగడ్ లో ఈ నెల 20న బంజారాల ఆధ్యాత్మిక వేడుకలు





**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** జాగో బంజారా సమాజ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కందనెల్లి తండా గ్రామ శివారులోగల యాడిబాపు గడ్ దేవస్థాన్ ఆధ్యాత్మిక కేంద్రంలో ఈ నెల 20వ తేదీ శుక్రవారం నాడు యావత్ బంజారా జాతి ఆరాధ్య దేవుడు శ్రీశ్రీశ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహరాజ్ 316వ అవతార మహోత్సవ భోగ్ పూజ ఆధ్యాత్మిక సాంస్కృతిక వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు యాడీబాపుగడ్ దేవస్థాన్ ఆధ్యాత్మిక కేంద్రం ఆలయ ధర్మకర్తలు జాగోబంజారా సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ రామావత్ సురేందర్ నాయక్ మహరాజ్ ,రామావత్ శాంతిదేవిలు తెలిపారు.ఈ మేరకు సోమవారం బంజారా ఆధ్యాత్మిక వేడుకలకు సంబంధించిన పోస్టర్ ను విడుదల చేశారు.ఈ సందర్భంగా శ్రీ రామావత్ సురేందర్ నాయక్ మహరాజ్, రామావత్ శాంతి దేవిలు మాట్లాడుతూ..

**బంజారాల ఆరాధ్యదైవం, తత్త్వకాలజ్ఞాని సేవాలాల్ మహరాజ్**

భూలోకంలో మానవ సమాజంలో అరాచకం, అధర్మం, అశాంతి ఏర్పడి ప్రజలు భయభ్రాంతులతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆకాలంలో దేవదేవుడు ధర్మస్థాపన కోసం మానవ రూపంలో ప్రవేశించి మానవరూపిధారుడైన శ్రీశ్రీశ్రీ సేవాలాల్ భగవాన్ ఈ భూమిపైకి పంపిబడ్డారన్నారు.తత్త్వ కాలజ్ఞాని అయిన సద్గురు శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహరాజ్ బంజారా జాతిలో అవతరించి భారత దేశ వ్యాప్తంగా సంచరిస్తూ ధర్మోపదేశం చేస్తూ తన గురు బోధనల ద్వారా ప్రజలందరిని సన్మార్గంలో నడిపిస్తూ జాతిని సంస్కరించారన్నారు.తన భక్తులకు ఏలాంటి బాధలు, దు:ఖాలు,రోగాలు, శోకాలు లేకుండా చేశారన్నారు. శివపార్వతుల అనుగ్రహంతో తన నోటి నుండి వెలువడిన ప్రతి వాక్కు నిజం చేశారన్నారు.నాడు వినిపించిన భవిష్యవాణి నేడు అక్షరాల నిజమవుతున్నదని అన్నారు. శివపార్వతుల అనుగ్రహంతో ఫిబ్రవరి 20, 17013 గుత్తి బళ్ళారి అప్పుడు కర్ణాటకలో ఉండేదని, ఇప్పుడు అనంతపురం జిల్లాలో ఉన్నదని, అక్కడ సేవాగడ్ ఏర్పడ్డదని అన్నారు.భీమాబాపు ధర్మణి మాత తల్లి దండ్రులకు సేవాలాల్ మహరాజ్ జన్మించారన్నారు.09041804లో భూలోకం నుండి కైలాసా లోకానికి వెళ్ళిపోయారన్నారు.బంజారాలు తమ ఆరాధ్య దైవంగా భావించి "పాంచ్ నామేవాళో జగే నతారేవాళో" అంటూ మొక్కుతూ పూజలు చేస్తారని అన్నారు. ప్రతి తండాలో(అయి బాయా) మేరామా(జగదాంబ) శ్రీ సంత్ సేవాలాల్ మందిరాలు నిర్మించబడి ఉన్నాయన్నారు.

**యాడీబాపుగడ్ భగవంతుడికి ప్రీతికరమైన దైవ భూమి**

యాడీబాపు గడ్ దేవస్థాన్ దైవ భూమి అని, భగవంతుడికి ప్రీతికరమైన భూమి అని అన్నారు. ఇక్కడ సుమారు 5 ఎకరాల భూమి మా పుర్వికుల నుండి మాకు సంక్రమించినదని, గత 16 సంవత్సరాలు క్రితం మహా తపస్వి పోహార దేవి పీఠాధిపతి శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ వంశానికి చెందిన శ్రీశ్రీ రామ్ రావ్ మహరాజ్ దేవాలయాల నిర్మాణాల కోసం శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. 20022010 నాడు మమ్మల్ని ఆశీర్వాదించి రూ.11 వేల రూపాయలను కూడా విరాళంగా ఇచ్చారని,సభా సమక్షంలో ఇక్కడ పుణ్యక్షేత్రంగా వర్ధిల్లుతుందని పలికారని అన్నారు.వరుసగా 3 సార్లు శ్రీశ్రీ రామ్ రావ్ మహరాజ్ చేతులమీదుగా పూజలు జరుపబడిన పవిత్రస్థలం యాడిబాపుగడ్ దేవస్థాన్ భూమి అని అన్నారు.

**తాండూరు పట్టణానికి 3 కిలోమీటర్ల దూరంలో యాడీబాపుగడ్ దేవస్థాన్**

వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి 3 కిలోమీటర్ల దూరంలో జహీరాబాద్ నేషనల్ హైవే రోడ్డుకు అనుకొని అడవికి అనుకొని ఉన్న భగవంతుడికి ప్రీతికరమైన 5 ఎకరాల భూమిలో విశాలమైన స్థలంలో ఆగమశాస్త్రం ప్రకారం రూ.2 కోట్ల రూపాయల వ్యయంతో శివా సేవా,భవాని మాత మందిరాల నిర్మాణాలు చేపట్టబోతున్నామని తెలిపారు. సకల జనులకు భావితరాలకు ఉపయోగపడే విధంగా ఆధాత్మిక కేంద్రంగా పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడానికి తీవ్రంగా కృషి చేస్తున్నామని, భవిష్యత్ లో ఇక్కడ అనాథ ఆశ్రమం,విద్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. దైవ సంకల్పంతో జరుపబడుతున్న దైవ కార్యక్రమానికి మత, ప్రాంత, జాతి, కులాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు తమకు తోచిన విధంగా వస్తు రూపంలోకానీ, డబ్బు రూపంలో కానీ సహకరించి దైవాను గ్రహాన్ని పొందాలని కోరారు. ఇక్కడి స్థలానికి దైవశక్తి, సంత్ సాధుల శక్తి, మహర్షుల శక్తి, యోగుల శక్తి ఉన్నదని, ఇక్కడ స్వయంభూ వెలసిన ఎల్లమ్మ తల్లి భక్తుల కోరికలు నెరవేరుస్తున్నదని, అనేక సమస్యలతో ఇక్కడికి వచ్చి దర్శించుకుంటున్నవారికి మనశ్శాంతి లభించి వారి కోరికలు కూడా నెరవేరుతున్నాయన్నారు. ఇక్కడ మహిమ ఉన్నదని, శివుని లింగమును మహా సంతోషంతో స్థాపించామని అన్నారు.

**బంజారా ధర్మస్థాపన సందేశ్ సభకు తరలిరండి**

బంజారా జాతి, భాషా సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ కోసం బంజారా ధర్మస్థాపన కోసం ఈ నెల 20న కందనెల్లి యాడీబాపుగడ్ లో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహరాజ్ 316వ అవతార మహోత్సవ భోగ్ పూజ ఆధ్యాత్మిక సాంస్కృతిక వేడుకలకు, భారత్ బంజారా ధర్మస్థాపన సందేశ్ సభకు పెద్ద సంఖ్యలో భక్తులు,నవతరం,మేధావులు, సంఘ నాయకులు, రాజకీయ నాయకులు, ఉద్యోగస్తులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తునా తరలివచ్చి దేవుని సందేశాలు విని దైవానుగ్రహంతో మనశాంతిని పొందాలని ఆలయ ధర్మకర్తలు రామావత్ సురేందర్ నాయక్ మహరాజ్,రామావత్ శాంతి దేవిలు ప్రజలను కోరారు.

# పదిహేనేళ్ల బాలిక పై యువకుడి లైంగిక దాడి

- గర్భం దాల్చడంతో ఆలస్యంగా వెలుగులోకి
- తండాలో నుండి పరారైన యువకుడు
- రాజీ కోసం షాడో సర్పంచ్ మధ్యవర్తిత్వం



**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అభం శుభం తెలియని వయసు,నిండా పదిహేనేళ్లు కూడా నిండని బాల్యం, తండ్రి లేని ఓ మైనర్ బాలికపై ఓ యువకుడు కన్నేశాడు.మాయ మాటలు చెబుతూ దగ్గరయ్యాడు.బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో బెదిరింపులకు గురి చేసి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఫలితంగా బాలిక గర్భం దాల్చింది ఇదేంటని అడిగితే తనకేం సంబంధం లేదని ముఖం చాటేశాడు తిరుమలాయపాలెం మండలంలోని పెద్దతండా గా పిలువబడే ఓ తండాకి చెందిన ఓ యువకుడు బాలిక ఇంటి చుట్టూ తిరుగుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారానికి పాల్పడుతూ వచ్చాడు. కొన్ని రోజుల అనంతరం బాలిక అనారోగ్యానికి గురైంది.వాంతులు,కళ్ళు తిరగడం,జ్వరంతో బాధ పడుతూ ఉండటం,శరీరంలో మార్పులు రావడాన్ని గమనించిన తల్లి బాలికను ప్రశ్నించగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో సదరు యువకుడు ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారం చేశాడని జరిగిన దారుణాన్ని తెలిపింది.కనీస లోకజ్ఞానం తెలియని తల్లికి ఏమి చేయాలో తెలియక తండాలో సన్నిహితులుగా ఉండే వారికి తెలియపరచింది.దీంతో వారు ఆ యువకుడి ఇంటికి వెళ్లి నిలదీయగా తనకేం సంబంధం లేదంటూ బుకాయించాడు.యువకుడి తల్లితండ్రులు సైతం తమ కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని వాగ్వాదానికి దిగుతారు.అంతటితో ఆగకుండా ఉండకుండా యువకుడిని కొన్ని రోజుల పాటు వేరే ఊరికి పంపించి చేతులు దులుపుకున్నారు.దీంతో బాలిక సన్నిహితుల సాయంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైంది.దీంతో షాడో సర్పంచ్ గా వ్యవహరించే ఓ వ్యక్తి,మరో వ్యక్తితో కలిసి బాలికకు జరిగిన అన్యాయాన్ని బయటకి పొక్కకుండా మధ్యవర్తిత్వం వహించి గోప్యంగా ఉంచుతారు.ఇప్పటికే తండాలో ఓ వ్యక్తి ఓ బాలిక పై అత్యాచారం చేసి గర్భవతిని చేయగా ఫోక్సో కేసు నమోదై జైలుకి వెళ్లాడని,పోలీస్ స్టేషన్ లో కేసు పెడితే ఈ యువకుడి పై కూడా ఫోక్సో కేసు నమోదవుతుందని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయకుండా రాజీ చేసే ప్రయత్నం చేశారు.రేపు,మాపు అంటూ కాలయాపన చేయడం,బాలికకు న్యాయం చేయకపోవడం,బాలికకు గర్భం నెలలు పెరగడంతో,దిక్కుతోచని ఆ బాలిక యువకుడి ఇంట్లోనే దీక్షకు దిగడంతో విషయం తండా మొత్తం వ్యాపించి,కచ్చితంగా పోలీస్ కేసు నమోదవుతుందని భావించి పెళ్లికి సిద్ధమైనట్లుగా సమాచారం.

## బర్దిపూర్ ఉపాధిహామీ పనులు ప్రారంభం..



- 100 రోజులను వినియోగించుకోండి
- ఏపీవో రాజ్ కుమార్, సర్పంచ్ రాజు



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఏ) కింద 100 రోజుల పని దినాలను జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఝరాసంగం ఏపీఓ రాజ్‌కుమార్, బర్దిపూర్ గ్రామ సర్పంచ్ రాజు ఉపాధి కూలీలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం బర్దిపూర్ గ్రామంలో ఉపాధిహామీ పనులను ఉపాధి కూలీలు వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ఉన్న 33 గ్రామపంచాయతీలలో ఉపాధి పనులు ప్రారంభమైనట్లు ఏపీఓ రాజ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా చెరువుల శుభ్రత, కాలువల తవ్వకం, మొక్కల నాటకం, గ్రామ అభివృద్ధి పనులు చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుకారాం,వార్డు సభ్యులు చింతచెట్టు రాజు,ఎర్రోళ్ల రత్నమ్మ, అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ దామగాన్య పాల్గొన్నారు.

## పెద్దేముల్ మండలంలో జోరుగా వరి నాట్లు

- మండలంలో 3,130 ఎకరాల్లో వరి పంట సాగు
- ఇప్పటికే పలు గ్రామాల్లో నారుమడులు సిద్ధం
- వరి నాట్లకు సిద్ధమైన వరి బందాలు
- ఆయా గ్రామాల్లో జోరుగా సాగుతున్న వరి నాట్లు
- వరి పంట సాగులో అన్నదాతలు బిజీ బిజీ



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలంలో వరినాట్లు జోరందుకున్నాయి.ముఖ్యంగా పెద్దేముల్ మండల కేంద్రం తోపాటు బుద్దారం, గాజీపూర్, కందనెల్లి, మంబాపూర్, జనగాం, మన్ సాన్ పల్లి, మదనంతాపూర్,మారెపల్లి తండా,రేగొండి, రుక్మాపూర్, జనగాంతోపాటు తదితర గ్రామాల్లో రైతులు వరి పంటను పండిస్తున్నారు. పెద్దేముల్ మండలంలో 202425 యాసంగి సీజన్ క్రాప్ బుకింగ్ ప్రకారం సుమారు 3,130 ఎకరాల్లో రైతులు వరి పంటను పండిస్తున్నారు. వరి పంట సాగులో భాగంగా రైతులకు వారి పంట పొలాలకు అనుకూలంగా కొందరు రైతులు సన్న రకం, కొందరు దొడ్డు రకం బియ్యాన్ని పండిస్తున్నారు. మండలంలో వరి పంట సాగులో భాగంగా రైతులు ముందస్తుగా నారు మడులను సిద్ధం చేసుకొని, తదుపరి సమయానుసారంగా, సీజన్ పరంగా వరి నాట్ల కోసం వరి బంధాలలో కరిగెట్ల పనులు పూర్తి చేసుకొంటున్నారు.కరిగెట్లు పూర్తి అవగానే కూలీల సహాయంతో వరి నాట్లను పెట్టుకొని వరి పంటను సాగు చేస్తున్నారు.ప్రస్తుతం పెద్దేముల్ మండలంలో వరి పండిస్తున్న రైతుల పంట పొలాల్లో వరి నాట్ల పనులు జోరుగా కొనసాగుతున్నాయి.

## పద్మ మరణం తీరని లోటు:సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి

- 29 వేల నగదు, 75 కేజీల బియ్యం వితరణ

**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఆలేటి పద్మ మరణం కుటుంబానికి తీరని లోటని తిరుమలాయపాలెం మండలంలోని జూపెడ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి అన్నారు.ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఆమె నివాసాన్ని పంచాయితీ పాలకవర్గం,గ్రామస్తులతో కలిసి సోమవారం ఆయన సందర్శించి పద్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి,మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మ మరణం కలచివేసిందని,భౌతికంగా మన మధ్య లేకపోయిన గ్రామస్తుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటుందని తెలిపారు. అనంతరం పంచాయితీ పాలకవర్గం,దాతలు అందించిన 29 వేల రూపాయలు నగదు,75 కేజీల బియ్యాన్ని కుటుంబ సభ్యులకు వితరణగా అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లంజపల్లి రజిత,శ్రీనివాస్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలుగడ్డం ప్రభాకర్ రెడ్డి,అంబాల రామ్మూర్తి,కోట ఉపేందర్ రెడ్డి,మంగయ్య వెంకన్న,వీరబాబు,శ్రీకాంత్,కృష్ణారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.





Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com